సాక్షి ఆదిలాబాద్

శనివారం । 11 । నవంబర్ । 2023



సెల్‌ఫోన్‌లో ప్రచార గోల..!

శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారమంతా సెల్‌ఫోన్ చుట్టూ తిరుగుతోంది. ఓటర్లను వేగంగా ఆకర్షించేందుకు మొబైల్స్‌పైనే ఆధారపడతున్నారు. IIలో▸



దండారీ సంబురం

నేరడిగొండ: మండలంలోని ఆరెపల్లి గ్రామంలో దండారీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తమ సంస్కృతి చాటేలా ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలతో ఆకట్టుకున్నారు.

గరిష్టం/కనిష్టం
34.0 /21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ఎగ్జిబిట్‌ను వివరిస్తున్న విద్యార్థిని

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ కాంగ్రెస్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రజలకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు తయారు చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్‌అధికారి రఘురమణ, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, ఆరె భాస్కర్, నీల, రాజేశ్వర్, సూపరింటెండెంట్ రమణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఉద్యోగికి డిప్యూటేషన్


రోగుల బిల్లులు స్వాహా

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖలో అక్రమాలకు పాల్పడిన ఉద్యోగిపై డీఈవో చర్యలకు పూనుకున్నారు. 'రోగుల బిల్లులు స్వాహా..' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి ఆ ఉద్యోగిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హిందీ హైస్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. ఇప్పటికే మెమో జారీ చేయగా, ఆయన వివరణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యా శాఖాధికారి ప్రణీత తెలిపారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

నేరడిగొండ: వందశాతం పన్నులు వసూలు చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయవద్దని వ్యాపారులకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు చెత్తను సేకరించే క్రమంలో వారికి అందించాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట ఎంపీవో శోభన, సర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రాఘవ, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ యువజన విభాగం అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి రోజులు గడుస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం..



ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న తరఫున శుక్రవారం మరో సెట్ నామినేషన్ అందజేస్తున్న ఆ పార్టీ నాయకులు

జంగ్ తెలంగాణ

- వివిధ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు
- ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ రెబల్‌గా సంజీవ్‌రెడ్డి
- యుగ తులసీ పార్టీ నుంచి వన్నెల అశోక్
- బోథ్‌లో కాంగ్రెస్ నుంచి ఆడె గజేందర్‌తో పాటు నరేశ్ జాదవ్
- 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ

నియోజకవర్గం	అభ్యర్థులు	నామినేషన్ సెట్లు
ఆదిలాబాద్	32	54
బోథ్	13	27
ఖానాపూర్	17	26
ఆసిఫాబాద్	23	33

సాక్షి,ఆదిలాబాద్: శాసనసభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. వివిధ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించడం జరిగింది. రాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఇదిలా ఉంటే అక్టోబర్ 9న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 3న ఎన్నికల కమిషన్ నుంచి నోటిఫికేషన్ జారీ అయింది. ఆ రోజు నుంచి మొదలైన నామినేషన్ల ఘట్టం శుక్రవారంతో పూర్తయింది. ఈనెల 13న వాటి పరిశీలన చేపట్టనున్నారు. 15న ఉపసంహరణ ఉండనుంది.

రెబల్స్.. ఆసక్తికరం..

ఆదిలాబాద్ నుంచి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా ఎ.సంజీవ్ రెడ్డి శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. బోథ్‌లో కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోల్పోయిన వన్నెల అశోక్ గురువారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. దీంతో కాంగ్రెస్ రెబల్‌గా ఆయన బరిలో ఉంటారా అని అందరు భావించారు. అయితే శుక్రవారం ఆయన యుగ తులసీ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీనికి కారణం లేకపోలేదు. ఈ పార్టీ గుర్తు రోడ్ రోలర్. కారు గుర్తును పోలి ఉందని బీఆర్ఎస్ పార్టీ ఇదివరకు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే.. యుగ తులసీ పార్టీతో బీఆర్ఎస్‌కు ఒప్పందం జరిగిందనే ప్రచారం సాగింది. అయితే ఆదిలాబాద్, బోథ్‌లలో ఈ పార్టీ నుంచి అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతోనే వన్నెల అశోక్ స్వతంత్ర అభ్యర్థిగా కాంగ్రెస్‌కు రెబల్‌గా నిలుస్తారా.. లేనిపక్షంలో రోడ్ రోలర్ గుర్తుపై పోటీ చేయాలనుకోవడంతో ఆయన ఉద్దేశంపై ఆయా పార్టీల్లో గందరగోళానికి గురవుతున్నారు. ఇదిలా ఉంటే బోథ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థి ఆడె గజేందర్‌తో పాటు నరేశ్‌జాదవ్ నామినేషన్ వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో ఉపసంహరణ రోజు వరకు దీని విషయంలో ఒక స్పష్టత వచ్చే అవకాశం లేదు.

ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి నామినేషన్లు..

జోగు రామన్న (బీఆర్ఎస్), కంది శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), పాయల్ శంకర్ (బీజేపీ), సత్యనారాయణ ఎల్చవార్ (బలిరాజ పార్టీ), కేమ శ్రీనివాస్ (ప్రజా ఏక్తా పార్టీ), సూర్యవంశీ విద్యాసాగర్ (బహుజన్ ముక్తి పార్టీ), అగ్గిమల్ల గణేష్ (ధర్మ సమాజ్ పార్టీ), ఉయిక ఇంద్ర (బహుజన్ సమాజ్ పార్టీ), గుడిపల్లి జ్ఞానేష్ (భారత చైతన్య యువజన పార్టీ), కె.భగవాన్ (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), వాగ్మారే అభిషేక్ (ఆర్‌పీఐ), సురేష్ (యుగ తులసీ పార్టీ), టి.చంద్రషా (గోండ్వాన గణతంత్ర పార్టీ), స్వతంత్ర అభ్యర్థులు.. నాగన్న గాలిపెల్లి, ముండె ప్రవీణ్ కుమార్, భాను రాజేశ్వర్‌రావు, షేక్ అస్లమ్, సుభాష్ నవాటే, అన్నం దేవేందర్, టి.పండిత్ రావు, కె.విజయ్ కుమార్, గడ్డం సాయిమౌన రెడ్డి, గెడం జనార్దన్, ముండె ప్రవీణ్ కుమార్, తొగరి నిఖిలేష్, బెదోడ్కర్ గణేశ్, అల్లూరి సంజీవ్ రెడ్డి, నవాటే సుభాష్, పాయల్ శరత్, మాదస్తు భుపేందర్, మోరే హరీష్‌చంద్ర, టి.ధర్మపాల్.

బోథ్ నియోజకవర్గం..

అనిల్ జాదవ్ (బీఆర్ఎస్), సోయం బాపురావు (బీజేపీ), ఆడె గజేందర్ (కాంగ్రెస్), నరేష్ జాదవ్ (కాంగ్రెస్), మెస్రం జంగుబాపు (బీఎస్పీ), ఉయికె ఉమేష్ (డీఎస్పీ), వన్నెల అశోక్ (యుగ తులసీ పార్టీ, స్వతంత్ర అభ్యర్థి), జాదవ్ గోపాల్ (భారత చైతన్య యువజన పార్టీ), బడు నైతం (గోండ్వాన గణతంత్ర పార్టీ), ఉయికె హీరాజి (రాష్ట్రీయ జన క్రాంతి పార్టీ), తొడసం ధనలక్ష్మి (స్వతంత్ర), జాదవ్ బొజ్జనాయక్ (స్వతంత్ర).

ఖానాపూర్ నియోజకవర్గం..

భుక్యా జాన్సన్ నాయక్ (బీఆర్ఎస్), రమేశ్‌రాథోడ్ (బీజేపీ), వెడ్మ బొజ్జు పటేల్ (కాంగ్రెస్), కె.విజయ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), రాథోడ్ బన్సీలాల్ (బీఎస్పీ), రాథోడ్ కళ్యాణి (బీఎస్పీ), జాదవ్ ప్రభాస్ (ధర్మ సమాజ్ పార్టీ), రితేష్ రాథోడ్ (బీజేపీ), పెందూర్ ప్రియాంక (సీపీఐఎంఎల్ -రెడ్ స్టార్), జి.గంగాధర్ (భారత చైతన్య యువజన పార్టీ), స్వతంత్ర అభ్యర్థులు.. ఎన్.రాజేందర్, జె.రవికిరణ్, మోహన్, బి.ఆశారెడ్డి, ఆత్రం రవీందర్, చౌహాన్ సేవదాస్, ఆత్రం భీంరావు.

ఆసిఫాబాద్ నియోజకవర్గం..

కోవ లక్ష్మి (బీఆర్ఎస్), శ్యామ్‌నాయక్ (కాంగ్రెస్), అజ్మీరా ఆత్మారాం నాయక్ (బీజేపీ), ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 23 మంది ఉన్నారు.



బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న, ఆయన కూతురు కృష్ణవేణి

అట్టహాసంగా సంజీవ్‌రెడ్డి నామినేషన్

కైలాస్‌నగర్: కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ అల్లూరి సంజీవ్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. శుక్రవారం ఆయన ఆదిలాబాద్ నియోజకవర్గంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. వేలాది మందితో డప్పుచప్పుళ్ల నడుమ శాంతినగర్‌లోని దివంగత చిల్కూరి రాంచంద్రారెడ్డి నివాసం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం రిటర్నింగ్ అధికారి స్రవంతికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఇందులో సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి సంజీవ్‌రెడ్డి

నాల్గోసారి స్వతంత్ర అభ్యర్థిగా..



బోథ్: బోథ్ నియోజకవర్గ భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం(యూసీసీఆర్ ఐ-ఎంఎల్)పార్టీ నాయకుడు దివ్యాంగుడైన జాదవ్ భోజ్యానాయక్ స్వతంత్ర అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. గతంలో జరిగిన ఓ ప్రమాదంలో ఆయన కాలు పోయింది. కాగా 2004, 2009, 2014లో కూడా నామినేషన్ దాఖలు చేశానని, ఇది నాల్గోసారని ఆయన పేర్కొన్నారు.

నామినేషన్ వేసేందుకు వస్తున్న భోజ్యానాయక్

ప్చ్.. టైం అయిపాయే..!

బోథ్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల గడువు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. ఆజాద్ సమాజ్ పార్టీ అభ్యర్థి గయాకాంబ్లె దళిత్ నిర్దేశిత సమయం లోపు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకోకపోవడంతో ఆయన నామినేషన్ దాఖలు చేయలేదు. మధ్యాహ్నం 3 గంటలు దాటడంతో అధికారులు ఆయనను లోనికి అనుమతించలేదు. దీంతో ఆయన నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.



సమయం మించిపోవడంతో వెనుదిరిగిన గయాకాంబ్లె

సమన్వయంతో పనిచేయాలి



సి-విజిల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీబీ పాటిల్

- విధులు సమర్థవంతంగా నిర్వహించాలి
- పర్యవేక్షణ పారదర్శకంగా ఉండాలి
- ఎన్నికల సాధారణ పరిశీలకులు జీబీ పాటిల్

కైలాస్‌నగర్: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు గణేశ్ బాపురావు పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్నికల ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం, వ్యయ బృందం, సి-విజిల్, మీడియా సెంటర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. వాటి నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల పర్యవేక్షణ పారదర్శకంగా ఉండాలన్నారు. సి-విజిల్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులు రిజిస్టర్‌లో రోజువారీగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిక్స్ బృందాలకు సమాచారం అందించి వాటిని పరిష్కరించాలన్నారు. అనంతరం మీడియా సెంటర్‌ను సందర్శించి ఎంసీఎంసీ విధులు, రోజువారీ ప్రకటనలు, పెయిడ్ న్యూస్, తదితర రికార్డులను పరిశీలించారు. సామాజిక మాధ్యమాల్లో జరిగే ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సోషల్ మీడియాసెల్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఎఫ్‌ఎం రేడియో, లోకల్ కేబుల్ చానల్స్‌లో వచ్చే రాజకీయ ప్రకటనలు, ప్రచారాల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవాలని ఎంసీఎంసీ సభ్యులకు సూచించారు. అనంతరం ఆర్వో కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, ఆర్‌వో స్రవంతి, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఈడీఎం రవికుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో..

బోథ్: బోథ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు జీబీ పాటిల్ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్‌తో చర్చించారు.

తమ్మీ.. ఏం కావాలె!

- యువతకు తాయిలాల ఎర
- మందు, విందులతో ప్రసన్నం
- ఆకట్టుకునేలా అభ్యర్థుల పోటాపోటీ యత్నాలు



కైలాస్‌నగర్: 'ఏం తమ్మీ ఎట్లున్నవ్.. ఈ సారి మన పార్టీకే ఓటెయ్యాలే. మనమే అధికారంలోకి వస్తున్నాం. నీతో పాటు మీ ఇంట్లోళ్లయ్, రిలేటివ్స్, ఫ్రెండ్స్ అందరి ఓట్లు మనకే పడాలే. ఏమున్నా మనోళ్లిచ్చి చూసుకుంటరు. ఊళ్లో నువ్వే ముందుండి నడిపించాలా. ఓట్లన్నీ గంపగుత్తగా మనకే పడేలా చూడాలా. సోషల్ మీడియాలో మన పార్టీని హోరెత్తించాలి...' ఇలా ఏ ఊళ్లో చూసినా ఆ పార్టీ అభ్యర్థులు ఓటర్ల మధ్య ఇవే మాటలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులు యువతను ఆకట్టుకునేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారు. విందులు, తాయిలాలతో వారిని ప్రసన్నం చేసుకునేందుకు ఆరాటపడుతున్నారు.

యువతే టార్గెట్

నామినేషన్ల పర్వం ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు రెబెల్‌గా బరిలో నిలిచిన వారు ఎన్నికల ప్రచారంపై పూర్తి దృష్టి సారించారు. వివిధ వర్గాల గంప గుత్త ఓట్లపై నజర్ వేశారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారంతో పాటు ఓట్లలో కీలకంగా ఉన్న యువతపై ఫోకస్ పెంచారు. వారిని తమ వైపు తిప్పుకునేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో మొత్తం 4,42,438 మంది ఓటర్లుండగా ఇందులో 40 ఏళ్లలోపు యువకులు 60,078 మంది ఉన్నారు. వీరిని ఆకర్షిస్తే తమ ప్రచారం సులువు కావడంతో పాటు ఓట్లు కలిసి వస్తాయనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీలతో పాటు ఆర్థికంగా బలంగా ఉన్న స్వతంత్ర అభ్యర్థులు సైతం వారిని ఆకట్టుకునేందుకు పోటాపోటీగా యత్నిస్తున్నారు.

జోరుగా విందులు

ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు యువత తమ వెంటే ఉండాలనే ఉద్దేశంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు వారిని మందు, విందుల్లో ముంచెత్తుతున్నారు. తాము కోరుకున్న బ్రాండ్ల మద్యంతో పాటు నాన్ వెజ్‌తో కూడిన దావత్‌లను అరెంజ్ చేస్తూ నిత్యం వారిని ఖుషీ చేస్తున్నారు. పట్టణాలతో పాటు అన్ని గ్రామాల్లోనూ ప్రస్తుతం ఇదే పరిస్థితి. తమ వెంట తిరిగే యువత ఏమాత్రం నారాజ్ కాకుండా ఉండేలా వారికి అవసరమైన మర్యాదలు చేసేందుకు ద్వితీయశ్రేణి నాయకులకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. సదరు నాయకులు యువకులతో నిత్యం టచ్‌లో ఉంటూ వారు అడిగింది కాదనకుండా సమకూర్చుతున్నారు.

తాయిలాల ఎర

విందులతో పాటు యువతను ఆకట్టుకునేలా వివిధ రకాల తాయిలాల ఎర వేస్తున్నారు. వాహనాలకు అవసరమైన ఇంధనంతో పాటు మొబైల్ ఫోన్లకు ఆరు నెలల నుంచి ఏడాది వరకు అవసరమైన రీచార్జీలు చేయిస్తున్నారు. సంఘాలుగా ఉన్న యువత సేవలను వినియోగించుకునేలా క్రీడా పరికరాల కిట్లను అందజేస్తున్నారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే స్వయం ఉపాధికి అవసరమైన బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని, ప్రభుత్వపరమైన సబ్సిడీ పథకాలను అందించేందుకు కృషి చేస్తామని భరోసా కల్పిస్తున్నారు. మరికొంత మంది నాయకులు ఈ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే గోవా వంటి విహారయాత్రలకు తీసుకెళ్లేలా ప్రణాళికలు సైతం సిద్ధం చేయిస్తున్నారు. ఇలా యువతను ప్రసన్నం చేసుకునేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇదే అదునుగా యువత సైతం నాయకుల ముందు తమకు అవసరమైన డిమాండ్లను ఉంచుతున్నారు. అయితే వాటన్నింటిని నేరవేర్చేదిశగా అభ్యర్థులు ప్రత్యేకంగా ద్వితీయ శ్రేణి నాయకులకు బాధ్యతలు అప్పగించడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

కళలను ప్రోత్సహించేందుకే కళోత్సవం

- డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను వెలికితీసేందుకు కళోత్సవం ఎంతగానో దోహదపడుతుందని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో శుక్రవారం వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఆయా పాఠశాలలకు చెందిన 101 మంది విద్యార్థులు హాజరై కళలను ప్రదర్శించారు. జానపద నృత్యం, ఫోక్ డ్యాన్స్, పెయింటింగ్, ఏకపాత్రాభినయం, తబలా, హార్మోనియం తదితర పోటీల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన పది మంది బాలికలు, పది మంది బాలురను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తున్నట్లు డీఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సుజాత్ ఖాన్, శ్రీకాంత్‌గౌడ్, న్యాయ నిర్ణేతలు కబీర్‌దాస్, వజ్రమాల, కవిత, సతీష్, నరేందర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఇన్విజిలేషన్ డబ్బుల చెల్లింపులో జాప్యం

- 'సర్వే' రెమ్యునరేషన్ కోసం తప్పని నిరీక్షణ

ఆదిలాబాద్‌టౌన్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది విద్యాశాఖాధికారుల తీరు. ఈ నెల 3న జిల్లాలోని వివిధ పాఠశాలల్లో స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డైట్ కళాశాలల విద్యార్థులు, మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థులకు ఇన్విజిలేషన్ విధులు కేటాయించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి అప్పట్లోనే ప్రభుత్వం 60 శాతం నిధులు విడుదల చేసింది. డీఈవో అకౌంట్‌లో డబ్బులను సమగ్ర శిక్ష ద్వారా జమ చేశారు. పరీక్ష పూర్తయిన తర్వాత విధులు చేపట్టిన వారికి రెమ్యునరేషన్ చెల్లించాల్సి ఉంది. అయితే పరీక్ష ముగిసి వారం దాటినా ఇప్పటికీ డబ్బులు రాలేదని వారు పేర్కొంటున్నారు. ఇతర జిల్లాల్లో ఈ డబ్బులను ఇప్పటికే చెల్లించగా, ఇక్కడ మాత్రం పరిస్థితి భిన్నంగా మారింది. ఒక్కో విద్యార్థికి విధులు నిర్వహించినందుకు రూ.500, టీ, స్నాక్స్ కోసం రూ.200 కేటాయించింది. జిల్లాకు మొత్తం రూ.10లక్షల 23వేల 166లను కేటాయించగా, 60 శాతం నిధులు విడుదల చేసిందని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన విద్యార్థులకు రూ.4లక్షల 66వేల 400 చెల్లించాల్సి ఉంది. సొంత ఖర్చుతో జిల్లాలోని ఆయా పాఠశాలల్లో వీరికి విధులు కేటాయించగా, బాధ్యతాయుతంగా పరీక్ష నిర్వహించారు. వివిధ కారణాలు చూపి డబ్బులు చెల్లించడం లేదని వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై డీఈవో ప్రణీతను ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు యత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

డబ్బులు పంచిన వ్యక్తులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్‌: స్వతంత్ర అభ్యర్థి అల్లూరి సంజీవ్‌రెడ్డి నామినేషన్‌ ర్యాలీ శుక్రవారం ఆదిలాబాద్‌ పట్టణంలో చేపట్టారు. ఈ సందర్భంగా అభ్యర్థికి సంబంధం లేకుండా ముగ్గురు వ్యక్తులు డబ్బులు పంచుతుండగా వన్‌టౌన్‌ పోలీసులు గమనించి వారిని పట్టుకున్నారు. పట్టణంలోని డైట్‌ మైదానం సమీపంలో జైనథ్‌ మండలం పెండల్‌వాడకు చెందిన మంచాల లస్మన్న వద్ద నుంచి రూ.21వేల నగదు, కరంజి గ్రామానికి చెందిన బిక్కి గంగన్న నుంచి రూ.5వేలు, అర్లి(బి) గ్రామానికి చెందిన గణపతి నుంచి రూ.18వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్‌ ఎస్సైలు హబీబ్‌ ఖాన్‌, నవీన్‌, ఉదయ్‌కుమార్‌లు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి సంజీవ్‌ రెడ్డికి మద్దతుగా నిలిచి ఓటు వేయాలని ర్యాలీలో పాల్గొన్న కొంతమంది జనాలను ప్రలోభాలకు గురిచేసినట్లు వివరించారు.

పట్టపగలే చోరీ

- నగదుతో పాటు బంగారం అపహరణ



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని బొక్కల్‌గూడ కాలనీలో నివాసం ఉంటున్న మహ్మద్‌ ఖాన్‌ అనే వ్యాపారి ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరులేని సమయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. మూడున్నర లక్షల నగదుతో పాటు మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లారని బాధితులు తెలిపారు. ఇంట్లోని బీరువాను పగలగొట్టడంతో పాటు ఇంట్లోని సామగ్రిని చిందరవందరగా పడేశారు. ఈ విషయం తెలుసుకున్న వన్‌టౌన్‌ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

కిరాణంలో చోరీ

ఉట్నూర్‌రూరల్‌: మండలంలోని లక్కారంలోని కిరాణ దుకాణంలో గురువారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుల వివరాల ప్రకారం... లక్కారంలో రాజశేఖర్‌ కిరాణం యజమాని రాజశేఖర్‌ గురువారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు శుక్రవారం తిరిగి దుకాణం వద్దకు రాగానే చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. దుకాణంలోని రూ.8వేల నగదు, సామగ్రి చోరీకి గురైనట్లు బాధితుడు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్‌: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసు అధికారి భోజన్న వివరాల ప్రకారం.. ఉదయం 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పట్టణంలోని డాల్డా కంపెనీ సమీపంలో రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తు తెలియని రైలు ఢీకొని మృతుడి శరీరం నుంచి తల వేరై పట్టాలపై పడింది. మృతుడి ఒంటిపై నీలిరంగు టీషర్ట్‌, బూడిద రంగు జీన్స్‌ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని రిమ్స్‌లోని మార్చురీలో భద్రపరిచామని, వివరాలకు సెల్‌ నం.9440442722పై సంప్రదించాలని పేర్కొన్నారు.

సెల్‌ఫోన్‌లో ప్రచార గోల..!



- మొబైల్‌లోనే చర్చోపచర్చలు
- నెట్‌ డాటా, చార్జింగ్‌ ధమాల్‌
- జనాలకు తప్పని 'ఓటు'పాట్లు

మంచిర్యాలఅర్బన్‌: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారమంతా సెల్‌ఫోన్‌ చుట్టూ తిరుగుతోంది. ఓవైపు ప్రచార రథాలు.. ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నా.. ఖర్చులేకుండా ఓటర్లను వేగంగా (క్షణాల్లో) ఆకర్షించేందుకు అభ్యర్థులు సెల్‌ఫోన్‌పై ఆధారపడతున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తుండగా వాట్సప్‌ గ్రూపులు ఏర్పాటు చేసుకుని ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే పార్టీలన్నీ సోషల్‌ మీడియా ప్రచారకర్తలను నియమించుకుని ప్రచారాన్ని వేగవంతం చేశాయి. ఆయా పార్టీల అభ్యర్థుల ఫొటోలు, గుర్తులతో.. పార్టీలు ఏమి చేస్తాయో చెబుతూనే.. ఎదుటి వ్యక్తి లోపాలు ఎత్తి చూపుతున్నారు. వ్యక్తిగత దూషణల పర్వం కొనసాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రూపుల్లో ప్రచారం సాగిస్తున్నారు. సెల్‌ఫోన్‌ నెట్‌ ఆన్‌ చేశారో.. లేదో ఇలా వాట్సప్‌లో వివిధ పార్టీల మెస్సేజ్‌లు వస్తున్నాయి. ఓ పార్టీ ఎన్నికల సమావేశాలు నిర్వహించే చోట వంట, టెంట్‌, ఎన్నికల అవసరాల కోసం నియమించిన కమిటీలకు సమాచారం చేరవేయటానికి వాట్సప్‌ గ్రూపుల కమిటీలు ఏర్పాటు చేశారు. నేరుగా మాట్లాడేందుకు సమయం లేకపోవటంతో గ్రూప్‌ కాల్స్‌పై ఆధారపడుతున్నారు. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల సమాచారం చేరవేసేందుకు సెల్‌ఫోన్లు కీలకంగా మారాయి.

చర్చలే చర్చలు

టీవీల్లో డిబేట్‌ల మాదిరిగా వాట్సప్‌ గ్రూప్‌లో ఎన్నికల వేళ చర్చలు సాగుతున్నాయి. అభ్యర్థుల పనితీరు.. ఇతర విషయాలపై విశ్లేషణలు లేకపోలేదు. ఎత్తిపొడిచే సందేశాలు కూడా లేకపోలేదు. ఇదివరకు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో చౌరస్తాల వద్ద సాగే ఎన్నికల ముచ్చటంతా సెల్‌ఫోన్‌లో కొనసాగుతోంది. అనుకూల, వ్యతిరేక సందేశాలు (మెస్సేజ్‌లు) సెల్‌ఫోన్‌లోనే కొనసాగుతున్నాయి. అసంతృప్త నేతలంతా వాట్సప్‌ కాల్‌ వినియోగిస్తూ బయటకు పొక్కకుండా జాగ్రత పడుతున్నారు. ఒక్క నియోజకవర్గం కాకుండా ఇతర నియోజకవర్గాల గెలుపోటములపై ఆరా తీయటం కనిపిస్తోంది. నలుగురు కలిస్తే సాగే చౌరస్తా ముచ్చట్లన్నీ సెల్‌ఫోన్‌లకు మారాయన్న మాట.

నెట్‌ ఆన్‌ చేస్తే చాలు..

ఎన్నికల వేళ సెల్‌ఫోన్‌ నెట్‌ ఆన్‌ చేయాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. మొబైల్‌ డాటా ఆన్‌చేశారో లేదో.. వందలాది పోస్టులు ఒకేసారి వస్తున్నాయి. దీంతో రోజువారీ నెట్‌ డాటా గంటల్లో ఖర్చవుతోంది. మరోవైపు బ్యాటరీ చార్జింగ్‌ దిగిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఏమనలేక గమ్మున ఉండాల్సిన పరిస్థితి సామాన్యులది.

ఓటర్లకు ఇక్కట్లు

సెల్‌ఫోన్‌లో ఎన్నికల ప్రచారమాటిలా ఉన్నా ఓటర్లకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇదివరకు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సెల్‌ఫోన్‌ నంబర్లు సేకరించేవారు. ప్రస్తుతం ఎవరికి వారే సోషల్‌ మీడియా గ్రూపులు క్రియేట్‌ చేస్తూ వారిని అందులో చేర్చుతున్నారు. పదుల సంఖ్యలో ఫొటోలు, వీడియోలు, ఒకేసారి గ్రూపులో పోస్టు చేస్తుండటంతో సగటు ఓటరుకు తిప్పలు తప్పటం లేదు. అవసరమున్న సమాచారం కంటే అనవసర ఎన్నికల సందేశాల గోల ఎక్కువ కావటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇంకోవైపు గ్రూపు నుంచి నిష్క్రమిద్దామంటే నంబర్‌యాడ్‌ చేసిన వ్యక్తులు ఏమనుకుంటారో.. అని మొహమాటపడాల్సి వస్తోంది. సందేశాలు కూడా చదవటానికి వీల్లేకుంటున్నాయి. ఒకే గ్రూపులో అనుకూల, వ్యతిరేక పోస్టులు వస్తుండటంతో ఓటరు గందరగోళానికి గురవుతున్నారు. తటస్తులు మాత్రం చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఉంది.

కోటీశ్వరుడు.. నారాయణరావుపటేల్‌

భైంసా: ముధోల్‌ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల అధికారికి అఫిడవిట్‌లు అందించారు. నామినేషన్‌ పత్రాల్లో తమ ఆస్తుల వివరాలు తెలియజేశారు. కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీల అభ్యర్థుల ఆస్తులు కోట్ల రూపాయల్లోనే ఉన్నాయి.

నారాయణరావుపటేల్‌,కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి..

బోస్లే నారాయణరావుపటేల్‌ కాంగ్రెస్‌ పార్టీ తరఫున పోటీచేస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లో, ఎఫ్‌డీల్లో రూ.10,99,35,132. భార్య పేరిట రూ. 5,16,05,886, ఉమ్మడి కుటుంబం కింద రూ. 1,21,98,719 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన వద్ద రూ. 5,31,700 విలువైన 191గ్రాముల బంగారం, భార్య వద్ద రూ. 4,55,000 విలువైన 140 గ్రాముల బంగారం, ఉమ్మడి కుటుంబంలో రూ.18,74,090 విలువైన 250గ్రాముల నగలు, జువెల్లరీ ఉన్నట్లు పేర్కొన్నారు. భూములు, ఇండ్లు, ఇతర స్థిరాస్తి తన పేరిట రూ. 30,37,06,215, తన భార్య పేరిట రూ. 19,92,01,230గా అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

రామారావుపటేల్‌, బీజేపీ అభ్యర్థి

పవార్‌ రామారావుపటేల్‌ బీజేపీ తరఫున పోటీచేస్తున్నారు. తన వద్ద బ్యాంకులు, ఇతర డిపాజిట్‌ల రూపంలో రూ.8,26,87,216. ఉమ్మడి కుటుంబం కింద రూ.52,13,567 ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన పేరిట ఉన్న ఇండ్లు, భూములు, స్థిరాస్తి విలువ రూ. 19,00,24,610గా పేర్కొన్నారు.

విఠల్‌రెడ్డి బీఆర్‌ఎస్‌...

గడ్డిగారి విఠల్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ తరఫున ఎన్నికల రిటర్నింగ్‌ అధికారికి ఇచ్చిన అఫిడవిట్‌లో తన ఆస్తులు చూయించారు. ఆయన పేరు మీద రూ. 65,21,901, తన భార్య పేరిట రూ. 15,79,981గా చూయించారు. భూములు, ఇండ్లు, ఇతర స్థిరాస్తి విలువ రూ.2,85,55,606గా, తన భార్యపేరిట రూ. 7,42,875గా అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

గెలిపిస్తే..రోడ్డేపిస్తా

- బాండ్‌ పేపర్‌ రాసిచ్చిన రాథోడ్‌ రమేశ్‌

కడెం: రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉమ్మడి గంగాపూర్‌ గ్రామానికి వంతెన, రోడ్డేపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్‌ రమేశ్‌ హామీ ఇచ్చారు. వంతెన, రోడ్డు నిర్మాణం చేస్తానని గ్రామస్తులకు బాండ్‌ పేపర్‌ రాసిచ్చారు. శుక్రవారం మండలంలోని గంగాపూర్‌ ఉమ్మడి పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. రాథోడ్‌ సమక్షంలో గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఇందులో బీజేపీ మండలాధ్యక్షుడు కిష్టయ్య ఉన్నారు.



రాథోడ్‌ సమక్షంలో బీజేపీలో చేరిన గ్రామస్తులు



వేడివేడి బజ్జీలు ఎప్పుడన్న తింటరు కానీ.. ఇవి ఎలక్షన్‌ స్పెషల్‌ బజ్జీలు. రండి తినండి.. కానీ.. ఓటు మాత్రం మన కారు గుర్తుకే వేయండి.. అన్నట్లుగా మంత్రి ఐకేరెడ్డి శుక్రవారం నిర్మల్‌లో ప్రచారంలో ఇలా ఆకట్టుకున్నారు. –నిర్మల్‌

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కిషన్‌

ఆదిలాబాద్‌: జిల్లా క్రీడాకారులు జోనల్‌, రాష్ట్రస్థాయి షూటింగ్‌ బాల్‌ పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మహాలక్ష్మి వాడ ప్రధానోపాధ్యాయుడు పిల్లి కిషన్‌ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మహాలక్ష్మివాడలో నిర్వహించిన పాఠశాల అండర్‌ 17 జిల్లాస్థాయి జూనియర్‌ కళాశాల ఉమ్మడి జిల్లా అండర్‌-19 బాలబాలికల షూటింగ్‌ బాల్‌ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. వారికి మెరుగైన శిక్షణను సౌకర్యాలను అందజేస్తే గొప్ప క్రీడాకారులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులు ఈ రాష్ట్రస్థాయి పోటీల్లోని దత్తాత్రేయడం కాకుండా జాతీయ స్థాయిలో సైతం రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్జీఎఫ్‌ సెక్రటరీ కాంతారావు మాట్లాడుతూ అండర్‌ 17-19 రాష్ట్ర స్థాయి షూటింగ్‌ బాల్‌ పోటీలు మహబూబాబాద్‌ జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని వివరించారు. తెలంగాణ షూటింగ్‌ బాల్‌ సంఘం కోశాధికారి హరిచరణ్‌ మాట్లాడుతూ జిల్లా జట్టు, రాష్ట్రస్థాయి పోటీల్లో ఘనవిజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులకు 15రోజులపాటు శిక్షణ శిబిరం నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది షూటింగ్‌ బాల్‌ క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపిక పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయులు వివేక్‌, మజర్‌, గణేష్‌, అజయ్‌, గంగోత్రి పాల్గొన్నారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి

- రాజ్యాంగాన్ని ఎందుకు మార్చాలో సమాధానం చెప్పాలి
- ఓటును అమ్ముకోవద్దు.. నచ్చిన నేతను ఎన్నుకోవాలి
- గిరిజనేతరుల సంఘం సమావేశంలో ఆర్పీఐ జాతీయ అధ్యక్షుడు ప్రకాశ్‌ అంబేడ్కర్‌



మాట్లాడుతున్న ప్రకాశ్‌ అంబేడ్కర్‌

ఇంద్రవెల్లి: ఏజెన్సీ పరిధిలోని గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలని ఆర్పీఐ (రిపబ్లికన్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా) జాతీయ అధ్యక్షుడు, అంబేడ్కర్‌ మనుమడు ప్రకాశ్‌ అంబేడ్కర్‌ అన్నారు. మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్‌ హాలులో గిరిజనేతరుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనేతరులు తమ న్యాయమైన హక్కులు, సమస్యలపై ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏజెన్సీ పరిధిలో గిరిజనేతరుల సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని దళారుల చేతుల్లో పెడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు. అలాగే రాజ్యాంగాన్ని మార్చాలంటున్నవారు ఎందుకు మార్చాలో సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా, నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఓటును అమ్ముకోకుండా నచ్చిన నేతను ఎన్నుకోవాలన్నారు. అంతకముందు మండలంలోని అమరవీరుల స్తూపం, అంబేడ్కర్‌ విగ్రహం వద్ద, ఛత్రపతి శివాజీ, భగవాన్‌బాబా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌ వాగ్మారే, జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావ్‌, నాయకులు అక్బానీ, నర్సయ్య, బారిక్‌రావ్‌, దీపక్‌కుమార్‌, ఇంద్రవెల్లి పటేల్‌ మారుతి డోంగ్రె, నాయకులు గణేశ్‌, సంజీవ్‌ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గిరిజనేతరులు

గ్రామాల్లో ఎక్సైజ్‌ దాడులు

- ఐదుగురిపై కేసు నమోదు



దౌనెల్లిలో కల్తీ కల్లుతో ఎక్సైజ్‌ అధికారులు

కుంటాల: ఎన్నికల నియమావళి ఉల్లంఘించినందుకు, అనుమతులు లేకుండా కల్తీ విక్రయాలు చేస్తున్న దుకాణాలపై ఎక్సైజ్‌ అధికారులు శుక్రవారం సాయంత్రం మండలంలో ఆయా గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఎక్సైజ్‌ సీఐ సంపత్‌ కృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని కల్లూర్‌లో అనుమతి లేకుండా బెల్ట్‌ షాపు నిర్వహిస్తున్నారని, లింబా(బి), సూర్యాపూర్‌, మెదన్‌పూర్‌, దౌనెల్లి గ్రామాల్లో కల్తీ కల్లు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేశారు. సుమారు రెండు కిలోల క్లోరల్‌ హైడ్రేట్‌ స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. మెదన్‌పూర్‌లో కల్తీకల్లు విక్రయిస్తున్న వ్యక్తి పరారీలో ఉన్నాడని, ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడిలో ఎక్సైజ్‌ ఎస్సై రాయబారపు రవికుమార్‌, సిబ్బంది నరేందర్‌, ముత్యం, భాస్కర్‌, కల్పన పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో వీసీ వెంకటరమణ

భైంసా: సౌత్‌జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్‌ టోర్నమెంట్‌కు బాసర ట్రిపుల్‌ ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్‌ కేరళ తిరువనంతపురం, డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ ఫిజికల్‌ ఎడుకేషన్‌ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీ తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని డైరెక్టర్‌ సతీశ్‌కుమార్‌ తెలిపారు. ఇంటర్‌ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ట్రిపుల్‌ ఐటీలో క్యాంపస్‌ నియామకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్‌ఐటీ వీసీ వెంకటరమణ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్‌ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం క్యాంపస్‌ డ్రైవ్‌ నిర్వహించారు. గ్రిడ్లెక్స్‌ గ్రావిటీ ఫార్మా, దక్కన్‌ కెమికల్స్‌, ఎంఎస్‌ఎన్‌ ల్యాబ్‌లు, హ్యాగోసేవ్‌, విట్విట్‌, మోస్చిప్స్‌, జారస్‌ టెక్నాలజీస్‌, ఎడ్‌టెక్స్‌ కంపెనీలు ఈ నియామకాలు నిర్వహించాయి. ఇందులో పలువురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. కొలువులు సాధించిన విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ అభినందించారు. రూ. 4 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇప్పటి వరకు 62 మంది విద్యార్థులు క్యాంపస్‌ నియామకాల్లో కొలువులు సాధించారని పేర్కొన్నారు. ముమ్ముందు మరిన్ని కంపెనీలు క్యాంపస్‌ నియామకాలు చేపట్టేలా చూస్తామని డైరెక్టర్‌ సతీశ్‌కుమార్‌ తెలిపారు.

గుడుంబా స్థావరంపై దాడులు



పట్టుకున్న గుడుంబాతో ఎస్సై నరేశ్‌

ఇచ్చోడ: మండలంలోని జామిడిలో శుక్రవారం ఎస్సై నరేష్‌ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరంపై దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేస్తున్న రాథోడ్‌ రాజు ఇంటిపై దాడి చేసి 25 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుడుంబా తయారీ కోసం నిల్వ ఉంచిన ఐదువందల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రాథోడ్‌ రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆశ్రమపాఠశాలలో దండారీ ఉత్సవాలు




గుస్సాడీ వేషధారణలో ఆదివాసీలు



పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఖానాపూర్‌: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం దండారీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని అడవిసారంగాపూర్‌ పంచాయతీ పరిధిలోని జిల్లేడుకుంట గ్రామానికి చెందిన ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి గుస్సాడీ వేషధారణలో దండారీ ఉత్సవాలు నిర్వహించారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా జరిగిన ఈ ఉత్సవాల్లో పాఠశాలలోని ఆదివాసీ చిన్నారులు సైతం మమేకమై ఆటలు ఆడి, పాటలు పాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ముక్క రాజేశ్వర్‌, నగేష్‌బాబు, బక్కన్న, గ్రామపటేల్‌ అంకుష్‌రావు, వార్డెన్‌ జంగు ఉన్నారు.

స్వగ్రామానికి మల్లేశ్‌



భైరి మల్లేష్‌తో విజయ్‌ కుమార్‌

బోథ్‌: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన భైరి మల్లేష్‌ ఎట్టకేలకు ఇంటికి చేరుకున్నాడు. మల్లేష్‌ ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం దుబాయ్‌ వెళ్లాడు. దుబాయ్‌ వెళ్లిన భైరి మల్లేష్‌కి మూడు నెలలు మాత్రమే కంపెనీలో పనిచేశాడు. కంపెనీ అతడిని తీసివేయడంతో మూడు సంవత్సరాల నుంచి అక్కడ అష్టకష్టాలు పడ్డాడు. ఆయనతో ఉన్న పాస్‌పోర్టుతో పాటు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో దొరికిన పని చేస్తూ అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవనం గడిపాడు. దుబాయ్‌లో ఉండే తెలుగు వారు అతడిని పలకరించగా తాను ఆదిలాబాద్‌ జిల్లా బోథ్‌ మండలం పొచ్చెర గ్రామస్తుడనని తెలిపాడు. వారు సామాజిక మాధ్యమాల్లో అతడి పరిస్థితి వివరించారు. యూఏఈలోని జనసేన పార్టీ నేత విజయ్‌కుమార్‌ అతడిని కలిసి పాస్‌పోర్టు నంబరు తెలుసుకుని స్వగ్రామానికి పంపించాడు. మల్లేష్‌ ఇంటికి రావడంతో కుటుంబంలో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. విజయ్‌కి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



అన్వేష్‌(ఫైల్‌)

నేరడిగొండ: ప్రతిరోజు లాగే విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఓ ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని చించోలి గ్రామం వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వెంకటాపూర్‌ గ్రామానికి చెందిన రాథోడ్‌ అన్వేష్‌ (25) బోథ్‌ మండలంలోని పాట్నపూర్‌ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకొని సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా బొలెరో వాహనాన్ని ఢీ కొనడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఎస్సై సాయన్న మృతదేహాన్ని బోథ్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి మోతిలాల్‌ సైతం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. తండ్రికి ఒక్కడే కొడుకు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి.

ఆగివున్న లారీని ఢీకొన్న ఐచర్‌ వాహనం



ప్రకాశ్‌ కొకాడియా (ఫైల్‌)

గుడిహత్నూర్‌: మండలంలోని జాతీయ రహదారి 44పై డోంగర్‌గావ్‌ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఐచర్‌ వాహన డ్రైవర్‌ ప్రకాష్‌ కొకాడియా (23) మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... గురువారం రాత్రి 12గంటల ప్రాంతంలో నాగ్‌పూర్‌ నుంచి హైదరాబాద్‌కు ప్లాస్టిక్‌ లోడ్‌తో వెళ్తున్న ఐచర్‌ వాహనం డోంగర్‌ గావ్‌ వద్ద జాతీయ రహదారిపై ఆగివున్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌ ప్రకాష్‌ కొకాడియా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.